
TGTEL/25/A3750

... నిజమే ...

నిజాయితి

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితి" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం
ఇది విశ్వసనీయత, విధేయత మరియు
సమగ్రతను పెంచుతుంది.



ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 212 నెట్‌వర్క్ ఇంచార్జ్ & మెయింటెనెన్స్ : గుండూర్ శ్యామ్ . బుధవారం 09 సెప్టెంబర్ 2026 వెల 4:00

"వెయ్యి డప్పులతో కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడి"

కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని ముట్టడించిన కాంగ్రెస్
అధికార పార్టీ కార్యకర్తల డప్పుల మోత
బారికేడ్లు తోసుకుని దూసుకెళ్లిన కాంగ్రెస్
ఇరు వర్గాలు, శ్రేణుల మధ్య తోపులాట
భారీగా మోహరించిన పోలీసు బలగాలు
బారికేడ్లు, రోప్ పార్టీలతో కట్టు-దిట్టమైన భద్రత
తోసుకుని దూసుకెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు
బొల్లారం వద్ద కేటీ-ఆర్, హరీశ్‌రావుల నిర్బంధం
మర్కుక్ వద్ద బీఆర్ఎస్ రైతు దీక్ష..

రణరంగంగా 'ఎర్రవల్లి





హైదరాబాద్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవల్లి గ్రామ పరిసరాలు తీవ్ర ఉద్రిక్తతలకు వేదికయ్యాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం (ఫామ్‌హౌస్) ముట్టడికి కాంగ్రెస్ పార్టీ డప్పుల మోత పేరుతో పిలుపునివ్వడంతో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో కేసీఆర్ ఫామ్‌హౌస్ వేదికగా తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కాంగ్రెస్ శ్రేణులు డప్పుల మోతతో ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్ ముట్టడికి యత్నించడంతో తమ అధినేతను పరామర్శించేందుకు, ఆయనకు స్వయంగా రక్షణగా నిలిచేందుకు అసెంబ్లీ నుంచి బయల్దేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. అంతకు ముందుగానే కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ డప్పుల మోత నిరసన, బారికేడ్ల ధ్వంసం లాంటి కార్యక్రమాలు ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ శ్రేణులు సైతం భారీగా మోహరించడంతో ఎర్రవల్లి రణరంగాన్ని తలపించింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసు యంత్రాంగం భారీగా మోహరించి బారికేడ్లు, రోప్ పార్టీలతో కట్టు-దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నర్సారెడ్డి ఆధ్వర్యంలో వరదరాజపూర్ మీదుగా భారీగా చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు కేసీఆర్ ఫామ్‌హౌస్ వైపు దూసుకెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. బారికేడ్లను తోసుకుని కొందరు కార్యకర్తలు ఫామ్‌హౌస్‌కు దాదాపు అర కిలోమీటరు సమీపంలోకి వెళ్లి డప్పులు మోగిస్తూ నినాదాలు చేశారు. డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి బారికేడ్లను తోసుకుని నేరుగా ఫామ్‌హౌస్ వైపు పరుగు తీయడంతో పోలీసులు ఆమెను అడ్డుకుని వెనక్కి పంపారు. ఆందోళనకారులను నిలువరించే క్రమంలో పలువురు పోలీసు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి.

నా నాయకుడిని కాపాడుకుంటాం : కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసు బలగాలను మోహరించామని అధికారులు చెబుతున్నప్పటికీ, తమ నాయకుడి భద్రత విషయంలో ప్రభుత్వ పోలీసులపై తమకు ఎంతమాత్రం నమ్మకం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్ వ్యాఖ్యానించారు. 'మా నాయకుడిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది.. అందుకే మేమే స్వయంగా బయలుదేరాం' అని స్పష్టం చేశారు. ఈ పరిణామాలపై బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీ-ఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై అత్యంత తీవ్రస్థాయిలో సంచలన ఆరోపణలు గుప్పించారు. ఎర్రవల్లి ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆయన ఆరోపించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ అర కిలోమీటరు సమీపం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీ-ఆర్ నిలదీశారు. తమ సొంత పార్టీ నాయకుడి నివాసానికి వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడుగడుగునా ఎందుకు నిర్బంధిస్తున్నారో రాష్ట్ర డీజీపీ తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండు చేశారు.

మరోవైపు మర్కుక్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు భారీగా మోహరించాయి. ఫామ్‌హౌస్ సమీపంలో రైతు దీక్ష పేరుతో బీఆర్ఎస్ శ్రేణులు ఎదురు నిరసనకు దిగడంతో ఇరుపార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఫామ్‌హౌస్ వద్ద ఉద్రిక్తతల సమాచారం అందుకున్న వెంటనే శాసనసభ సమావేశాల నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పార్టీ ఎమ్మెల్యేలు నేరుగా ఎర్రవల్లికి వాహనాల్లో బయల్దేరారు. అయితే, శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు బొల్లారం, హకీంపేట చెక్‌పోస్టుల వద్ద వారి కాన్వాయ్‌లను నిలిపివేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు-చేసుకుంది. పోలీసులు వాహనాలను అనుమతించకపోవడంతో కేటీ-ఆర్, హరీశ్‌రావు ఇతర నేతలతో కలిసి బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపునకు పాదయాత్రగా బయల్దేరారు. ప్రభుత్వమే పోలీసుల అండతో కాంగ్రెస్ కార్యకర్తలను ఉసిగొల్పి దాడులకు పురిగొల్పుతోందని, ప్రతిపక్ష నేతలకు స్వేచ్ఛ లేకుండా చేస్తోందని ఈ సందర్భంగా వారు తీవ్రంగా ధ్వజమెత్తారు. ఉదయం నుంచి ఎర్రవల్లి, మర్కుక్, బొల్లారం పరిసర ప్రాంతాల్లో ఎప్పుడేం జరుగుతుందో తెలియని తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

స్పీకర్ ను పరామర్శించిన సిఎం రేవంత్..




హైదరాబాద్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కలిసి పరామర్శించారు. సోమవారం అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో స్పీకర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు కలిశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టిలు స్పీకర్‌ను పరామర్శించి, ఓదార్చారు. సోమవారం జరిగిన సంఘటనలపై వారిద్దరూ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు వారు హామినిచ్చారు.

పారా ఆర్చరీలో భారత్‌కు పతకాల పంట



హైదరాబాద్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
ఇక్కడ జరుగుతున్న పారా ఆర్చరీ వరల్డ్ సిరీస్ స్టేజ్3లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో పతకాల పంట పండించారు. ఈ పోటీల్లో భారత్ పురుషుల విభాగంలో రెండు స్వర్ణ పతకాలు సాధించింది. అంతేగాక మహిళల రికర్వ్ డబుల్స్‌లో రజతం దక్కించుకుంది. రికర్వ్ డబుల్స్ విభాగంలో హర్విందర్ సింగ్, విజయ్ సుందీ జోడడీ అద్భుత ప్రతిభతో అలరించి పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఈ జోడీ ఫైనల్లో 62తో స్లోవేకియా జంటను ఓడించింది. పురుషుల కాంపౌండ్ డబుల్స్ విభాగంలో తోమర్ కుమార్, శ్యామ్ సుందర్ జంట పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో ఈ జోడీ 152139 స్కోరుతో ఇరాన్ జంటను ఓడించింది. మహిళల రికర్వ్ డబుల్స్ విభాగంలో భావనా చౌదరి, పూజా జంట రజతం గెలుచుకుంది.

గాంధీ ఆసుపత్రికి సూపర్డెంట్ గా ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషారాణి బదిలీ





నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మెడికల్ సూపర్డెంట్ పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషారాణి 2025 జూలై నెల నుండి నాగర్ కర్నూల్ ఆసుపత్రి సూపర్డెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడిన ఉత్తర్వులు ప్రకారం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి సూపర్డెంట్ గా డాక్టర్ టి.ఉషారాణి బదిలీ అయ్యారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుప్రియ ఆసుపత్రి సూపర్డెంట్ గా ఆమె నుండి బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ టి ఉషారాణి బాధ్యతలు తీసుకున్న తదుపరి ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించుటలో ఆమె యొక్క పాత్ర విశేషంగా ఉన్నది. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే వీడ్కోలుకు అన్ని విభాగాల వైద్యులు,నర్సింగ్ సూపర్డెంట్ లు, నర్సింగ్ అధికారులు కార్యాలయ సిబ్బంది, ఆర్.ఎం.ఓ.లు. ఆమె సేవలను, వచ్చిన మార్పులను గుర్తు చేసుకుంటూ ఆమెకు ఘనంగా వీడుకోలు చెప్పారు.ఆమె బదిలీ నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలకు తీరని లోటు అని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు,వైద్యులు, నర్సింగ్ సూపర్డెంట్లు, నర్సింగ్ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

TGTEL/25/A3750 ... నిజమే ... నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
నిజాలను నిర్భయంగా
ప్రజల ముందుకు తీసుకు వెళ్లే
తెలుగు దినపత్రికతో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని
జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను
వివరాలకు సంప్రదించండి
9441946907

నాగర్‌కర్నూల్‌లో ఫిజియోథెరపీ అవగాహన ర్యాలీ



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
నాగర్ కర్నూల్: ప్రపంచ ఫ్రిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ హాజరై జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. నాగర్ కర్నూల్ పాత కలెక్టర్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది ఫిజియోథెరపీ ప్రాధాన్యత గురించి నినాదాలు ఇస్తూ ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో పారామెడికల్ కళాశాల విద్యార్థులు విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురికి సన్మానం చేశారు కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, తెలంగాణ ఫిజియోథెరపీ వెల్ఫేర్ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి ఎన్.సుమంత్ కార్యదర్శి డాక్టర్ ఎన్ సృజన, కోశాధికారి డాక్టర్ అంజలి డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



చదువుతోనే ఉన్నత శిఖరాలు

అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అంకూరి రాజు

తెల్కపల్లి, సెప్టెంబర్ 08 (నిజాయితి):
తెలకపల్లి గ్రామానికి చెందిన వెలుగు నిరంజన్ తనయుడు కొనిగారి సంపత్ నీట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచి, నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీట్ కి సెలెక్ట్ అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న తెల్కపల్లి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అంకూరి రాజు, సంపత్ కుమార్ ఇంటికి వెళ్లి, తల్లిదండ్రులకు మరియు విద్యార్థికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘ అధ్యక్షులు అంకురి రాజు మాట్లాడుతూ పేదరికం తరిమికొట్టాలంటే చదువు ఒకటే మార్గం అని, చదువుతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలియజేశారు, తెలకపల్లి గ్రామం నుండి సంపత్ కుమార్ ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల సంతోషం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నీట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచి, నాగర్ కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీటు కైవసం చేసుకున్న కొనిగారి సంపత్ కుమార్‌ని సన్మానించిన అంబేద్కర్ యూత్ సంఘం నాయకులు.

పారదర్శకంగా భూముల రీ సర్వే చేపట్టాలి

బెక్కెరలో సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్,
వివరాల నమోదులో ఎలాంటి తప్పులకు తావివ్వొద్దు,
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ వివరాల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.
భూ భారతి కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి మండలం బెక్కెర గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్.. సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, అధికారులు, సర్వేయర్లను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.
గ్రామ పరిధిలోని రెవెన్యూ భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించిన రీ సర్వే వివరాలపై అధికారులతో చర్చించారు. సర్వే ప్రక్రియకు సంబంధించి గ్రామంలోని రైతులకు ముందస్తుగా సమాచారం అందించారా? లేదా? అనే అంశంపై కూడా ఆరా తీశారు. రైతులకు పూర్తి సమాచారం అందిస్తూ, వారి సమక్షంలో భూముల హద్దులు, వివరాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.
భూముల రీ సర్వే అత్యంత కీలకమైన ప్రక్రియ అని, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.
డేటా నమోదులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అధికారులు, సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన భూ వివరాల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిర్దిష్ట నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
భూముల రీ సర్వేలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రైతుల భూ హక్కులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.
జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఏడి సర్వేయర్ గిరిధర్, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, ఆర్ఐ కార్తీక్ రెడ్డి, సర్వేయర్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న వాక్యాలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన రెడ్డి జాగృతి బృందం.



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్, రెడ్డి సామాజిక వర్గంపై చేసిన అనుచిత వాక్యాలను నిరసిస్తూ మంగళవారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ వెంకటరెడ్డికి ఫిర్యాదు అందజేయడం జరిగినది చట్టంపై గౌరవంతో పోలీసులను ఆశ్రయించాము రెడ్డి సామాజిక వర్గాన్ని ఉద్దేశించి చేసిన వాక్యాలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఈ వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు సమాజంలో ఏ వర్గానికించపరిచే విధంగా వాక్యాలు ఎవరు కూడా చేయడం సరికాదని వారు పేర్కొన్నారు కార్యక్రమంలో రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండకింది మాధవరెడ్డి జిల్లా అధ్యక్షులు బంక మోహన్ రెడ్డి, మొసలి శ్యాంప్రసాద్ రెడ్డి, నాయకులు, విజయేందర్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు

ప్రతి మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా దినోత్సవం

స్త్రీఆరోగ్యం గా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది

మహిళల ఆరోగ్యమే ఉత్తమ సమాజ అభివృద్ధికి సూచిక

పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం ప్రియాంక



బిజినపల్లి, సెప్టెంబర్ 08 (నిజాయితి):
తెలంగాణ ప్రభుత్వం మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేకమైన కార్యక్రమమే ఆరోగ్య మహిళా కార్యక్రమమని పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం ప్రియాంక తెలిపారు
ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం ప్రత్యేకంగా స్త్రీల కొరకు ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు మహిళలు శారీరకంగా మానసికంగా మరియు సామాజికంగా పరిపూర్ణంగా ఉండే స్థితినే ఆరోగ్యం అంటారు అని తెలిపారు. ప్రతి స్త్రీ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తాజా కూరగాయలు ఆకుకూరలు పండ్లు తృణ ధాన్యాలు మరియు తగినంత నీరు తీసుకోవాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు వ్యాయామం లేదా ప్రతిరోజు శారీరక శ్రమ చేయడం వల్ల శరీరం చురుగ్గా ఉంటుంది అని తెలిపారు అలాగే రోజు కనీసం ఏడు నుండి ఎనిమిది గంటలు ప్రశాంతమైన నిద్ర అవసరమని అలాగే మానసిక ప్రశాంతత ఒత్తిడిని తగ్గించుకుంటూ సానుకూల ధోరణితో ఉండాలని తెలిపారు మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండడమే మనిషికి లభించే నిజమైన మరియు గొప్ప సంపదని తెలిపారు ఆరోగ్యమే మహాభాగ్యం అనేది మన పెద్దలు ఎంతో అనుభవంతో చెప్పిన సత్యమైన నానుడి అని మనిషికి ధనము ఆస్తులు హోదా అంతస్తులు ఎన్ని ఉన్నప్పటికీ శరీరం రోగాల పాలైతే ఆ సంపదను అనుభవించే లేరు అని అందుకే సంపద కంటే ఆరోగ్యమే నిన్న అని పెద్దలు తెలిపారు అని అన్నారుమహిళ ఆరోగ్యంగా ఉండటం ఆమెతోపాటు కుటుంబానికి చాలా అవసరం కానీ స్త్రీలు ఇంటి వంట పనుల్లో పడి వారి ఆరోగ్యకరమైన అలవాట్లు పక్కన పెట్టేస్తారు దీనివల్ల ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతాయి అని డాక్టర్ తెలిపారు స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు ప్రతి మంగళవారం జరిగే ఆరోగ్య మహిళ కార్యక్రమం లో 50 నుంచి 100 వరకు వివిధ రకాల సమస్యలతో ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారని వారికి ఎంతో ఓపికతో ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ అవసరమైన అన్ని పరీక్షలు తెలంగాణ టీ హబ్ ద్వారా ద్వారా రక్త మూత్ర కెమెరా మొదలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఆరోగ్యకర మైన సమాజాన్ని సృష్టించడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు ఆరోగ్యకర సమాజం కొరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా లీగల్ సర్వీసెస్ అధారిటీ సెక్రటరీ నిహారిక



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 08 (నిజాయితి):
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో నాగనూల్ గ్రామంలోని కస్తూర్బా పాఠశాల, నందు 08- 09-2026 నాడు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది .ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీమతి నిహారిక సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగర్ కర్నూల్ గారు హాజరై మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వివరిస్తూ బాలబాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలకు వచ్చి చదువుకోవాలి అన్నారు బాల బాలికలందరూ ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లో వచ్చిన మెసేజ్ లను గాని వీడియోలను గాని, ప్రతిదానిని ఇతరులకు ఫార్వర్డ్ చేయడం గానీ, వాటికి తిరిగి రిప్లై ఇవ్వడం గాని చేయరాదని అన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలని అన్నారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవిస్తు ఉన్నత స్థితిని పొందాలని అన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాట్లాడుతూ ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు ఫోక్సో చట్టం అడ్డుకట్ట వేస్తుందని, అమ్మాయిలు అందరూ తమకు ఏ విధమైన సమస్యలు ఉన్న షీ టీం కు గాని ,చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కు గాని సమాచారం ఇవ్వాలని అన్నారు .ఉచిత న్యాయ సహాయం కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి లబ్ధి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ హౌడేకర్ పి.ఎల్.వి , చిలుక లక్ష్మణ్ అడ్వకేట్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ,ఉపాధ్యాయులు ,విద్యార్థులు, పత్రిక సోదరులు పాల్గొన్నారు